

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## బీద రాకతో కోలాహాలంగా మారిన జిల్లా టిడిపి కార్యాలయం



**నెల్లూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త -వైద్యం** టిడిపి శ్రేణుల హర్షధ్వానాల నడుమ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన బీద. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం భారీ గజమాలలు, శాలువాలు, పుష్పగుచ్చాలతో బీదకు అభినందనలు తెలిపిన పార్టీ నేతలు. తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్న నేతలు, కార్యకర్తలు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన పాతతరం టిడిపి నేతలను ఆప్యాయంగా పలకరించిన బీద. జిల్లా నలుమూలల తరలివచ్చి టిడిపి కార్యకర్తలు, నాయకులతో జిల్లాపార్టీ కార్యాలయం కిక్కిరిసింది.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు23 ,ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 4621 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74.600టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 100, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం100.119మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## మొంథా తుపాను ప్రభావిత గ్రామాల్లో ప్రభుత్వపరంగా సౌకర్యాలను కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్త**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** ఇటీవల జిల్లాలో సంభవించిన మొంథా తుపాను ప్రభావిత గ్రామాల్లో గుర్తించిన 3520 కుటుంబాలకు ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో మొంథా తుపాను ప్రభావిత గ్రామాల బాధితులకు కల్పించాల్సిన మౌలికవసతులపై ఆయాశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో జిల్లాలో 3520 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి, వారు నివసిస్తున్న గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులను, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి విపత్తు సంభవించినా వీరందరూ సురక్షితంగా ఆయా గ్రామాల్లోనే ఉండేలా చూడాలన్నది ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ వివరించారు. వీరందరికి ఆయాశాఖల అధికారులు నిర్దేశిత సమయంలోగా ప్రభుత్వపరంగా అన్ని వసతులు కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషిచేయాలన్నారు. గుర్తించిన వారిలో 780 మందికి ఆధార్‌కార్డులు లేవని, 820 మందికి రేషన్‌కార్డులు లేవని, జనవరి 31లోగా వీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఇవో, సివిల్ సప్లయిస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 1400మంది మహిళలను పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలని డిఆర్‌డిఎ పీడీకి సూచించారు. 1300 మందికి బ్యాంకు అకౌంట్లు ప్రారంభించాలని ఎల్‌డిఎంకు సూచించారు. 1800మంది ఇళ్ల స్థలాలు, 1000 మందికి ఇళ్లు, ఇంటి మరమ్మతులు చేపట్టాలని హౌసింగ్ అధికారులను, డిఆర్‌వోను ఆదేశించారు. జాబ్‌కార్డులు, ఫిషర్‌మెను మెంబర్‌షిప్ ఇప్పించాలన్నారు. సామాజిక పింఛన్లు 20 మందికి, 43 మందికి తల్లికి వందనం, 438 మందికి దీపం కనెక్షన్లు మంజూరు చేయాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. 34 మంది పిల్లలు బడికి వెళ్లకుండా ఉన్నారని, వారందరిని పాఠశాలల్లో చేర్పించాలని డిఇవోను ఆదేశించారు. సిసి రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ 3520 కుటుంబాలకు గుర్తించిన అన్ని సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశించిన గడువులో కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో విజయకుమార్, జడ్పీ సిఇవో శ్రీధర్‌రెడ్డి, డిపివో వసుమతి, డిఆర్‌డిఎ, మెప్మా పిడిలు నాగరాజకుమారి, గంగాభవాని, ఎల్‌డిఎం మణి శేఖర్, ఫిషరీస్ జెడి డాక్టర్ శాంతి, మెప్మా పిడి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

**- మంత్రి నారాయణ**

**- పలు సమస్యలను అధికారుల సమక్షంలో చెక్**

**- ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన మంత్రి నారాయణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన డివిజన్ ప్రజలు**

**ప్రజా దర్బార్‌లో మొటి రోజు 4వ డివిజన్లలో 326 అర్జీలు స్వీకరణ**



**నెల్లూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం** ప్రజా సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కారం మార్గం చూపే విధంగా ప్రజా దర్బార్ ప్రజలకు ఎంతో సహాయపడుతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో 3,10,39,48 డివిజన్లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కమీషనర్ నందన్ అధ్యక్షతన ఏర్పాటు చేశారని తెలిపారు. ముఖ్యంగా పెన్షన్లు, రేషన్ కార్డ్స్, స్ట్రీట్ లైట్లు, డ్రైన్లు, ఆధార్ కార్డ్ పలు రకాల స్కీమ్‌లు అర్జీ రూపంలో ప్రజలు అందించారని కమీషనర్ నందన్ తన దృష్టికి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కార మార్గం చూపుతామని వారికి భరోసా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాల్లోనే కాకుండా దురాభావం ఉన్న వారికి ఇంటి వద్దకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని స్థానిక టీడీపీ నేతలు తెలిపారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన 326 సమస్యల అర్జీలను వెంటనే పరిష్కార మార్గం చూపాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. ప్రజా దర్బార్‌లో టీడీపీ నేతలు మానవత్వాన్ని చాటుకున్నారు. దగ్గరుండి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అమ్మ, అవ్వ, అక్క తమ్ముడు, అంటూ ఆప్యాయంగా మాట్లాడుతూ వారి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని వారికి హామీ ఇవ్వడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధతో పాటు టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో వరి పంటలకు రుణాల పరిమితిని పెంపు

**- జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్త**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** మంగళవారం కలెక్టర్ చాంబర్లో వివిధ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేయుటకు జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ మీటింగ్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 2026 ఖరీఫ్, 2026-27 రబీ సీజన్లకు సంబంధించి జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలోని సహకార సంఘాల ద్వారా రైతులకు పంట రుణాల మంజూరు పై కమిటీ చర్చించింది. వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, సహకార శాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు, రైతు సంఘం నేతలతో చర్చించిన కలెక్టర్, రైతులకు ఆదాయం చేకూరే విధంగా వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా పంట రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వేరుశనగ, మొక్కజొన్న, ఆయిల్ ఫార్మ్, మల్లె సాగు, మత్స్య, ఆక్వా రంగాలకు రుణపరిమితిని పెంచుతూ కమిటి ఆమోదించింది. ఈ మేరకు వేరుశనగ పంటకు 50 వేల నుంచి 55వేలు, మొక్కజొన్నకు 47 వేల నుంచి 52వేలు, మల్లె సాగుకు 61 నుంచి 65వేలు, మత్స్య పరిశ్రమ ద్వారా పీతల పెంపకానికి యూనిట్‌కు 5 లక్షలు ఆర్థిక సహాయం పెంచాలని సిఫార్సు చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి పరిశ్రమ ఆవుల యూనిట్ కోసం 45 వేలు, గేదెల యూనిట్‌కు 50వేలు, పౌల్ట్రీ (ఒక బాయిలర్‌కు) 120, ఒక లేయర్ కు రూ.260 పెంచాలని సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. జిల్లాలో రైతులకు మెరుగైన ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ కోఆపరేటివ్ సొసైటీలు, బ్యాంకుల ద్వారా రుణ పరిమితిని పెంచి అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు విరివిగా రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్వో విజయ్ కుమార్, ఎన్‌డిసిసి బ్యాంక్ సీఈవో శ్రీనివాసరావు, జిల్లా సహకార శాఖ అధికారి బి. గురప్ప, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవేణి, ఎల్‌డియం ముని శేఖర్, పశు సంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, రైతు సంఘాల నాయకులు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నుడా ఒక బ్రాండ్ ఇమేజ్‌గా ఎదగాలి

**సరికొత్త ఆలోచనలతో నుడాకు ప్రత్యేక గుర్తింపు**

**- జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్త**



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో అర్బన్ డెవలప్‌మెంటు అథారిటి(నుడా)కి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా సరికొత్త ఆలోచనలతో, వినూత్నంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల నుడా అధికారులకు సూచించారు మంగళవారం నెల్లూరునగరంలోని వేదాయపాలెంలో గల నుడా



కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నుడా అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఛైర్మెన్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. తొలిసారిగా నుడా కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్‌కు నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా అజెండాలోని పలు అంశాలపై కమిటీ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిలాఇలలో నుడా పరిధి వేగంగా విస్తరిస్తోందని, నుడా పరిధిలో అనేక పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గృహ సముదాయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, మాల్స్ వంటి మౌళిక సదుపాయాలు అభివృద్ధి చెందనున్నాయని చెప్పారు. ఈమొత్తం అభివృద్ధి ప్రక్రియలో నుడా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు పొందేలా ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను నుండా చేపట్టాలని సూచించారు. ఎంఐజి హౌసింగ్ ప్రాజెక్టులతో పాటు పెద్ద నగరాల్లో ఉన్న వండర్‌లా, వాటర్ పార్కులు, అడ్వెంచర్ పార్కులు వంటి వినోదాత్మక ప్రాజెక్టులను అభివృద్ధి చేసి నుడా అంటే ప్రజల్లో ఒక బ్రాండ్ ఇమేజ్ ఏర్పడేలా సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాజెకుటలను పిపిపి పద్ధతిలో చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, తాను రెండోసారి నుడా ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టానని, చిరకాలం నిలిచిపోయే అభివృద్ధి పనులు చేపట్టాలన్నది తన ఆశయమని తెలిపారు. ఇందుకు కలెక్టర్ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎన్‌టిఆర్ నెక్లెస్‌రోడ్డు, నెల్లూరు రింగ్‌రోడ్డు ఏర్పాటుకు సహకారం అందించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. నుడా పరిధిలో కొన్ని భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, కొన్ని చోట్ల భూ సమస్యలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నెల్లూరు రింగ్‌రోడ్డు డిజైన్లు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మరో సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భూ సమస్యలను వెంటనే పరిష్కరించి నుడాకు అప్పగించాలని నుడా వైస్‌ఛైర్మెన్‌ను ఆదేశించారు. నుడా అభివృద్ధికి ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి అల్లంపాటి పెంచల్‌రెడ్డి, ప్లానింగ్ అధికారులు హిమబిందు, కాలేషా, ఏఓలు హేమలత, ఈశ్వర్‌రాజు, ఈఈ చంద్రయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ రాఘవేంద్రన్, టూరిజం అధికారి ఉషశ్రీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీద రవిచంద్రను సత్కరించిన జనసేన నేత నూనె మల్లికార్జునయాదవ్



**నెల్లూరు, డిసెంబరు 23, ప్రభాతవార్త-విద్య :** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన ఎమ్మెల్సీ బీద రవిచంద్రను మంగళవారం స్థానిక దేశం కార్యాలయంలో జనసేన పార్టీ కోర్‌కమిటీ సభ్యులు నూనె మల్లి కార్జునయాదవ్ మర్యాద పూర్వ కంగా బేటీ అయ్యారు.ఈ సందర్భంగా నూనె బీద రవిచంద్రను శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛాలను అందించి సత్కరించారు. అనంతరం శ్రీకృష్ణుడిని ప్రతిమను అందించి అభినందించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జునయాదవ్ మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీద అందించి సేవలు అభినందనీయమన్నారు. ఆయన చేసిన సేవలకు పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఇవ్వటం గర్వకారణమన్నారు. సాధారణ కార్యకర్తగా దేశంలో అడుగులు వేసిన బీద, పార్టీ రాష్ట్ర నాయకునిగా, ఎమ్మెల్సీగా, జిల్లా అధ్యక్షునిగా ఎదగటం స్ఫూర్తిదాయకమని, ఈ అభివృద్ధి ఆయన క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో బీద మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సింగంశెట్టి శ్రీరామ్, నక్కల శివకృష్ణ, రాము, మహేష్‌శర్మ, పేనేటి శ్రీకాంత్, పవన్‌యాదవ్, రాజేష్, చంటి, దివాణం సురేష్, షఫీ, షేక్.కరీం, శ్రీహర్ష, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## బూత్‌లెవల్ ఏజెంట్ సమావేశం



**కొడవలూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పార్టీల బూత్‌లెవల్ ఏజెంట్లు స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ సమావేశం తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40సంవత్సరాలుగా ఓటర్లు ఏ పోలింగ్ స్టేషన్‌లో ఉన్నారో ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తప్పిదాలను సరిచేయలంటే 2002 ఓటర్ల లిస్టును ప్రస్తుతం 2025 లిస్టును చూసి అందరిని మ్యాప్ చేయాలని బిఎల్ఓలకు సూచనలు ఇవ్వడం జరిగింది. నాయకులు ఓటర్ లిస్టు నమోదు ప్రక్రియలు బిఎల్ఓలకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కరకట మల్లికార్జున్, అన్నిపార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతి వేడుకలు



**కావలి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో సహాయ వ్యవసాయ కార్యాలయం నందు కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్. నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చడం జరిగింది. అనంతరం ఏడిఏ నాగరాజు మాట్లాడారు మాజీ ప్రధాని చరణ్‌సింగ్ మనదేశ రైతుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఆయనను గుర్తు చేసుకొని నివాళులర్పించడం గర్వకారణం అన్నారు. ఆయన గురించి మన తరువాత తరం వారికి తెలియచేయాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి మండల వ్యవసాయ అధికారిని ఎ.లలిత, రైతు నాయకులు ఎం.మాలకొండరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మమ్మల్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచండి

**మమ్మల్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచండి**




**కలువాయి, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించే దిశగా ప్రభుత్వ పెద్దలు, అధికారులు, కలువాయి మండల వాసుల మొర ఆలకించాలని కలువాయి సేవ్ ఉద్యమ కారులు వెల్లడించారు. ఆత్మ కూరు డివిజన్‌లో ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లా గూడూరు డివిజన్ పరిధిలోకి మార్చేందుకు ప్రభుత్వం నుండి విడుదలైన గెజిట్‌ను మండల ప్రజలు వ్యతిరేఖిస్తు 25 రోజుల నుండి నిరసనలు,నినాదాలతో హోరెత్తించారు. అదే విధంగా మంగళవారం 15 వ రోజుకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తు ప్రజలు పాల్గొన్నారు.

**ప్రజా ప్రతినిదులను కలిసిన జెఏసి నేతలు**

జిల్లాలోని ప్రజా ప్రతినిదులను కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగే విధంగా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతు మంగళవారం జెఏసి ఆద్వర్యంలో కూటమి నాయకులతో కలిసి వినతి పత్రాలు అందజేశారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,ఎంఎల్‌సి, పార్టీ జిల్లా అద్యక్షులు బీదా రవిచంద్ర, కలవగా నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు.

## కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాల పంపిణీ

**- శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్ కుమార్ నాయక్**



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివ జ్యోతి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా కంచెరపాలెం గ్రామ రైతులకు మంగళవారం వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. 30 కేజీల వంతున 35 సంచులు విశిష్టరకం వేరుశనగ విత్తనాలు రైతులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ ఈ విశిష్ట రకం తిక్క మచ్చ తెగులు, తృప్పు తెగులును తట్టుకొనే రకం అని కొంత మేర కుళ్ళు తెగుళ్లను తట్టుకొని అధికదిగుబడిని ఇస్తుందని రైతులకు తెలిపారు. జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా సామూహికంగా 35 మంది వేరుశనగ రైతులకు 35 సంచుల విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందని విజయ్ కుమార్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేరుశనగ సాగు చేసే రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి




**నెల్లూరుఅగ్రికల్చర్, డిసెంబర్23, ప్రభాతవార్త** నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డికాలనీ వద్దఉన్న భగత్‌సింగ్‌కాలనీలో కొంత మంది ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్లుగా మార్చి సొమ్ముచేసుకుంటున్నారనిస్థానిక తెలుగుదేశం పార్టీకార్యకర్త, ఇన్ఫులెన్సర్ ఈశ్వర్ నాడార్ మంగళవారం నెల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లెక్సీతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఉన్న కొంత మంది భూ కబ్జాదారులుగా మారి ప్రభుత్వ భూములు కొల్లగొడుతున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాలుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నా ప్రభుత్వ అధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని డిబ్లిక్‌లో ఏ3.5ల స్థలాన్ని లేఅవుట్‌గా మార్చి విక్రయిస్తున్నారని ఆరోపించారు. గతంలో తన అభ్యర్థన మేరకు అధికారులు భగత్ సింగ్ కాలనీలో ప్రభుత్వ భూములు పరిశీలించేందుకు రాగా వారిపై దాడికి పూనుకున్నారని వివరించారు. ప్రస్తుతం వీరు ఆక్రమించిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని స్థలాలు లేని పేదలకు పంచాలని విజ్ఞప్తి చేశారు.

## తెలుగువారు గర్వించదగ్గ నేత పీవీ- కోటంరెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త -వైద్యం** ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా గర్వంగా చెప్పుకోదగ్గ నేత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరు బాలాజీ నగర్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 21వ వర్ధంతి సభలో పాల్గొన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి మాట్లాడుతూ తెలుగువారు ఎక్కడున్నా గర్వంగా చెప్పుకోదగ్గ నేత పీవీ నరసింహారావు అని, దేశ పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించారని అటువంటి మహనీయుని కాంస్య విగ్రహాన్ని మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సంప్రదించి నెల్లూరు నగరంలో పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించిన గొప్ప పాలనాదక్షుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. పీవీ నరసింహారావు అధికారంలోకి వచ్చేనాటికి భారతదేశ బంగారు నిల్వలు సైతం ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టుబడిన పరిస్థితుల్లో ప్రధాన పదవిని చేపట్టి, ప్రపంచం అంతా ఆర్థికంగా ఇబ్బంది పడ్డా భారతదేశం మాత్రం ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించిన పాలనా దక్షుడు పీవీని చెప్పారు. దేశంలో సాఫ్ట్‌వేర్ రంగాన్ని విస్తృతపరిచి యువతకు అధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన నేత అని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని 2012 నుంచి నిరంతరాయంగా చేస్తున్నామని, పీవీ ఆదర్శంగా నేటి రాజకీయ వ్యవస్థ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. అదే విధంగా పీవీకి భారతరత్న అవార్డును ఇచ్చిన ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## ముగ్గురమ్మల జాతర మొదటి చాటింపు



**అల్లూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** అల్లూరు గ్రామ దేవతలైన శ్రీ గంగమ్మ శ్రీకలుగోలమ్మ, శ్రీ పోలేరమ్మ అమ్మవార్లకు జనవరి మొదటి మంగళవారం ఉత్సవం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దలు, పెద్దకాపు, పెద్దగొల్ల, పెద్దమాదిగ సమక్షంలో సాంప్రదాయ ఆచారాలు పాటిస్తూ మొదటి చాటింపు నిర్వహించారు. ముందుగా విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామ పెద్దలతో కలసి వినాయకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అల్లూరు గ్రామ దేవత అయిన శ్రీ పోలేరమ్మఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లూరు గ్రామ దేవతలు అయిన శ్రీ గంగమ్మ, శ్రీ కలుగోలమ్మ, శ్రీ పోలేరమ్మలకు జనవరి మొదటి మంగళవారం ముగ్గురు అమ్మవార్లకు వైభవంగా అల్లూరు ఊరు ప్రజల సహకారంతో ఉత్సవం నిర్వహించడం జరుగుతుందని గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరు ఊరు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గుండెమడగల గ్రామంలో కరెంటోళ్ళ జనబాట



**వింజమూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** వింజమూరు మండలం గుండెమడగల గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కరెంటోళ్ళ జనబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ నాగూర్ వలి తన సిబ్బందితో కలిసి గ్రామంలో పలు వీధులు సందర్శించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగూర్ వల్లి మాట్లాడుతూ ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు జన బాట కార్యక్రమం ద్వారా గ్రామాలలో క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు సిబ్బంది ప్రజలతో నేరుగా కలిసి విద్యుత్ సమస్యలను గుర్తించి వాటికి శాశ్విత పరిష్కారం చూపడం వినియోగదారుల నుంచి సలహాలు ఫిర్యాదులను సేకరించి విద్యుత్ సేవలను మెరుగుపరుస్తామన్నారు. అంతే కాకుండా విద్యుత్ లైన్‌లు ట్రాన్స్‌ఫార్మర్ల స్థితిగతులను స్వయంగా పరిశీలించి ప్రమాద రహిత విద్యుత్ సరఫరా చేయబడుతుందన్నారు. వారంలో రెండు రోజులు మంగళవారం, శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఫలితంగా దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు వచ్చే సమస్యలను సైతం పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది నవాజ్ విజయ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు విజయ దీపిక పంపిణీ



**వింజమూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** వింజమూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం విజయ దీపిక పుస్తకాన్ని పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ పి.రమేష్, సర్పంచ్ ఎన్.సుజన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ పోలుబోయిన రమేష్ మాట్లాడుతూ మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలలో 339 మంది పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అందులో 28 మంది తెలుగు మీడియం విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేశామన్నారు. జిల్లా పరిషత్ వారు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలను అందిస్తున్నారన్నారు. ఈ పుస్తకాలు క్షుణ్ణంగా విద్యార్థులు చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు పొందడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే రూపొందించబడిన పుస్తకమన్నారు. ఉత్తమ ఫలితాల సాధన లక్ష్యంగా ఈ పుస్తకం రూపొందించబడిందని తెలిపారు. కావున విద్యార్థులు ఈ పుస్తకాన్ని చక్కగా విపులంగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీర రాఘవులు, విజయ్ చంద్ర, రవి కుమార్, మల్లిఖార్జున, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

## మండల పరిషత్ సమావేశం



**వింజమూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** వింజమూరు మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీన శుక్రవారం నిర్వహించబడుతుందని ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

## సభ్యుల విశ్వాసాన్ని కోల్పోయిన ఇనగనూరి



**వింజమూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** వింజమూరు మండల పరిషత్ అధ్యక్షులు ఇనగనూరి మోహన్‌రెడ్డి సభ్యుల విశ్వాసాన్ని కోల్పోవడంతో అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 31వ తేదీన ఎంపీపీపై అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. ఎంపీటీసీ సభ్యులు 12 మంది గాను 11 మంది హాజరయ్యారు. వారిలో ముగ్గురు ఎంపీటీసీలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. మిగిలిన ఎనిమిది మంది ఆయనకు వ్యతిరేకంగా ఓటింగ్ చేశారు. ఈ అవిశ్వాస తీర్మాణానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులు ప్రభుత్వానికి పంపడంతో ప్రభుత్వం పరిశీలించి ఎంపీపీని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నేడు బుధ లేదా గురువారాలలో మండల ఉపాధ్యక్షులుగా ఉన్న ఇద్దరిలో ఒకరైన ఆనంగి రమణయ్యను ఇన్‌చార్జి అధ్యక్షులుగా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

## నెల్లూరు పార్లమెంటరీ టిడిపి నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు



**నెల్లూరు రూరల్ డిసెంబర్ 23 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రాజకీయ సందడి నెలకొంది. నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గారిని, అలాగే నెల్లూరు పార్లమెంటరీ టిడిపి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డిని టిడిపి నాయకులు కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజాసేవలో కొత్త నాయకత్వం కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి పాల్గొని నాయకత్వానికి బాధ్యతలు స్వీకరించిన నాయకులకు అభినందనలు తెలిపారు. అలాగే క్లస్టర్ ఇన్చార్జులు మస్తాన్ పెంచల నాయుడు, జలదంకి సుధాకర్, పఠాన్ సాబీర్ ఖాన్, కసవర్తి గంగాధర్, నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కాకుళ్ల శివకుమార్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి మైనారిటీ అధ్యక్షుడు షేక్ అస్లాం, 20వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు దారా మల్లి తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు.నెల్లూరు పార్లమెంటరీ పరిధిలో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. నూతన నాయకత్వంతో తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లాలో మరింత బలపడుతుందన్న విశ్వాసాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

## తెలుగువారు గర్వించదగ్గ నేత పీవీ- కోటంరెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త -వైద్యం :** ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా గర్వంగా చెప్పుకోదగ్గ నేత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరు బాలాజీ నగర్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 21వ వర్ధంతి సభలో పాల్గొన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి మాట్లాడుతూ తెలుగువారు ఎక్కడున్నా గర్వంగా చెప్పుకోదగ్గ నేత పీవీ నరసింహారావు అని, దేశ పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించిన అటువంటి మహనీయుని కాంస్య విగ్రహాన్ని మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సంప్రదించి నెల్లూరు నగరంలో పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించిన గొప్ప పాలనాధ్యక్షుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. పీవీ నరసింహారావు అధికారంలోకి వచ్చేనాటికి భారతదేశ బంగారు నిల్వలు సైతం ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టబడిన పరిస్థితుల్లో ప్రధాన పదవిని చేపట్టి, ప్రపంచం అంతా ఆర్థికంగా ఇబ్బంది పడ్డా భారతదేశం మాత్రం ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించిన పాలనా దక్షుడు పీవీ అని పేర్కొన్నారు. దేశంలో సాఫ్ట్‌వేర్ రంగాన్ని విస్తృతపరిచి యువతకు అధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన నేత అని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని 2012 నుంచి నిరంతరాయంగా చేస్తున్నామని, పీవీ ఆదర్శంగా నేటి రాజకీయ వ్యవస్థ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. అదే విధంగా పీవీకి భారతరత్న అవార్డును ఇప్పించిన ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## దండిగుంట గ్రామసభలో 4అర్జీలు



**విడవలూరు,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మండలంలోని దండిగుంట గ్రామ సచివాలయంలో వన్‌మంత్ వన్‌విలేజ్ ఫోర్‌విజిట్ గ్రామసభ కార్యక్రమం తహశీల్దార్ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజలు సిజెఎఫ్ భూమిలో తప్పిదాలు, భూమి విస్తరణ, రికార్డులో పేరు నమోదు కోసం వినతులు తహశీల్దార్‌కు అందజేశారు. వచ్చిన అర్జీలను పూర్తి పరిశీలన చేసి శాశ్వత పరిష్కారం చేస్తామని అర్జీదారులకు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్దుల్‌సలాం, వీఆర్ఓ నిఖిల్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీద రవిచంద్ర గారికి శుభాకాంక్షలు తెలియజేసిన కేతంరెడ్డి వినోద్ రెడ్డి



**నెల్లూరు రూరల్ డిసెంబర్ 23 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బీద రవిచంద్రని తెలుగుదేశం పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం బీద రవిచంద్ర ఇంటికి వెళ్లిన కేతంరెడ్డి వినోద్ రెడ్డి బీద రవిచంద్ర కి టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారి విగ్రహాన్ని బహుక రించారు. టిడిపి పార్లమెంట్ అధ్యక్షులుగా ఎన్నికవ్వడంపై హర్షం వ్యక్తం చేశా రు. పార్లమెంటు పరిధిలో పార్టీ బలోపేతానికి విశేష సేవలు అందించాలని వినోద్ రెడ్డి ఆకాంక్షించారు.

## మహాత్మాగాంధీ నరేగా పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు ఆపాలి




**నెల్లూరు రూరల్ డిసెంబర్ 23 ప్రభాతవార్త** గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2005లో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రారంభించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నేటి ఎన్‌డీఏ ప్రభుత్వం నీరుగారుస్తోందని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే. సంజయ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గాంధీ బొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాటాడారు.ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, నరేగా పథకం పేరును మార్చే ప్రయత్నాలు చేయడం ద్వారా గాంధీ జీ ఆలోచనలను, విలువలను తుడిచివేయాలన్న దురుద్దేశం కేంద్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. గాంధీ జీ పేరు తీసేసి నాథురామ్ గాడ్సే పేరు పెట్టాలన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పేర్లు మార్చితే ప్రజల జీవితాలు మారవని, పథకాన్ని నిర్వీర్యం చేయడమే కేంద్ర లక్ష్యంగా కనిపిస్తోందని చెప్పారు.ఫెడరల్ వ్యవస్థకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దక్షిణాది రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచే కుటిల ప్రయత్నాలు కేంద్రం చేస్తోందని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, పెత్తందారీ విధానాల వల్ల గ్రామీణ ప్రజల జీవన భద్రత ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటివరకు నరేగా పనులకు కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులు అందిస్తే, కొత్తగా ప్రవేశపెట్టిన బిల్లుతో 60:40 విధానంలో రాష్ట్రాలపై 40 శాతం ఆర్థిక భారం మోపడం అన్యాయమని సంజయ్ కుమార్ అన్నారు. ఇప్పటికే లోటు బడ్జెట్‌తో అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఈ భారాన్ని భరించే పరిస్థితిలో లేవని, దీనివల్ల గ్రామీణ ఉపాధి పూర్తిగా దెబ్బతిని పేదలు, గిరిజనులు, ఆదివాసీల జీవితాలు సర్వనాశనం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే అనేక మంది ఉపాధి లేక వలస బాట పట్టారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఏడాది నరేగా కింద కల్పించాల్సిన 12.50 లక్షల కోట్ల పని దినాలను 7.50 లక్షల కోట్లకు కుదించడం పేద ప్రజల హక్కులపై ప్రత్యక్ష దాడేనని సంజయ్ కుమార్ అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను, చట్టాలను పూర్తిగా నీరుగారుస్తోందని తీవ్ర విమర్శలు చేశారు.ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ పార్లమెంటులో బలంగా తన వాదన వినిపించాలని, ప్రత్యేక హోదా విషయంలో మౌనంగా ఉన్న ఎంపీలు కనీసం నరేగా అంశంపైనైనా మాట్లాడాలని డిమాండ్ చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పేదల హక్కుల కోసం అయినా గళమెత్తాలని కోరారు.పేదల ఆకలి, ఉపాధి హక్కులు కాపాడేందుకు షర్మిల రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అణగని పోరాటం కొనసాగిస్తుందని సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, 42వ వార్డు ఇంచార్జ్ ఇర్ఫాన్, మైనార్టీ నాయకులు హనీఫ్, సేవాదళ్ సుజాత, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అదానీ ఫౌండేషన్ సహకారంతో రైతులకు పనిముట్లు పంపిణీ



**ముత్తుకూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో అధాన్ ఫౌండేషన్ సకారంతో రైతులకు పనిముట్లును అదాని ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ రాకేష్ రంజన్ పంపిణీ చేశారు. జాతీయ రైతుల దినోత్సవం సందర్భంగా రైతు క్షేత్ర సందర్శన, సహజ వ్యవసాయ పద్ధతుల ప్రత్యక్ష ప్రదర్శ నజాతీయ రైతుల దినోత్సవం సందర్భంగా కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతుల క్షేత్ర స్థాయిలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం – రైతులు అనుసరిస్తున్న సహజ వ్యవసాయ విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగం, పశు పోషణకు సంబంధించిన పద్ధతులను ప్రత్యక్షంగా చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదాని కృష్ణపట్నం పోర్ట్, అదాని ఫౌండేషన్ సంస్థలకు చెందిన ఉద్యోగులు కెఎఫ్‌పిసిఎల్ రైతుల పొలాలను సందర్శించారు. రైతులు స్వయంగా చేపడుతున్న వ్యవసాయ కార్యకలాపాలను పరిశీలించి, వాటిపై ప్రత్యక్ష అవగాహన పొందారు. పొలాల సందర్శన సమయంలో రైతులు తాము అనుసరిస్తున్న సహజ వ్యవసాయ పద్ధతులను వివరించారు. మట్టి ఆరోగ్యాన్ని కాపాడుతూ సాగు చేసే విధానం, సహజ ఇన్‌పుట్ల వినియోగం, నేల దున్నే విధానం (టిల్లర్ వినియోగం) వంటి అంశాలను రైతులే ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అంతేకాకుండా, వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నారో కూడా వివరించి చూపించారు. దీని ద్వారా తక్కువ సమయంలో సమర్థవంతంగా పంట నిర్వహణ ఎలా సాధ్యమవుతుందో సందర్శకులకు స్పష్టంగా తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా పశుపోషణకు సంబంధించిన సూపర్ గ్రాస్, మేత గడ్డి పొలాలను కూడా సందర్శించారు. రైతులు కత్తులతో గడ్డిని ఎలా కోస్తారు, ఆ గడ్డిని పశువులకు మేతగా ఎలా వినియోగిస్తారో వివరించారు. ఈ ప్రక్రియలో అదాని సంస్థల ఉద్యోగులు కూడా పాల్గొని, రైతులతో కలిసి కొన్ని కార్యకలాపాలను నిర్వహించారు. దీని ద్వారా పశుపోషణలో గడ్డి ప్రాధాన్యతపై ప్రత్యక్ష అవగాహన కలిగింది. అదే విధంగా, మిర్చి (మిరప) పొలాల్లో పంట పెరుగుదల దశలో చేయాల్సిన పనులపై రైతులు వివరించారు. కలుపు తొలగింపు, పూల దశలో పంట సంరక్షణ వంటి వ్యవసాయ పనుల్లో సందర్శకులు పాల్గొని, రైతుల శ్రమను దగ్గర నుంచి అనుభవించారు. ఈ కార్యక్రమం సందర్భంగా కెఎఫ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మొత్తం ప్రణాళిక, అమలు, సమన్వయం కెఎఫ్‌పిసిఎల్ ద్వారానే నిర్వహించబడిందన్నారు. రైతుల ఉత్పాదకతను పెంచడం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు అవసరమైన మద్దతును అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిలిచింది. ఈ సందర్భంగా కె ఎఫ్‌పిసిఎల్ ప్రతినిధులు అదాని కృష్ణపట్నం పోర్ట్, అదాని ఫౌండేషన్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం, స్థిరమైన వ్యవసాయం, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహంలో ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని కె ఎఫ్‌పిసిఎల్ తెలియజేసింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కారం శెట్టి శివరాం ప్రసాద్ శర్మ, కోమారి సునీల్, రాగాల వెంకటరమణ, మక్కి మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేటలో మూడవరోజు పల్స్‌పోలియో



**అనుమసముద్రంపేట ,డిసెంబరు23,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట పిహెచ్‌సి పరిధిలో మూడవరోజు పల్స్ పోలియో కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎల్ఆర్‌స్వామి మంగళవారం నిర్వహించారు. మండలంలోని దూబగుంట, రాజవోలు, ఏఎస్‌పేట, అనుమసముద్రం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పోలియోచుక్కలు వేశారు. దర్గాకి బయట ప్రాంతాల నుంచి వచ్చి పోలియోచుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ తెలిపారు. 0 నుండి5సంవత్సరాల పిల్లలు 2336మందికి 2374 మందికి (దర్గాకు వచ్చిన బయటప్రాంతాలవారితో కలిసి) పోలియో చుక్కలు వేశామన్నారు. 101.2శాతం లక్ష్యాన్ని సాధించామని డాక్టర్ స్వామి తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సేవా తత్వాం అలవరచుకోవాలి




**కలువాయి డిసెంబర్ 23 ప్రభాతవార్త :** విద్యార్థి దశ నుండే విద్యార్థులలో సేవా తత్వాన్ని అలవర చుకో వాలని కుల్లూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిఫల్ షేక్ మహబూబాషా తెలిపారు. ప్రిన్సిఫల్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ద్వారా ప్రత్యేక సేవా శిబిరాన్ని మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామం నందు మంగళ వారం నిర్వహించారు. గ్రామంలోని వీదులను విద్యార్ధులు ర్యాలీతో ప్రారంభించి మండల ప్రాధమిక పాఠశాల మెయిన్ నందు పిచ్చి చెట్లను చెత్తాచెదారాలను తొలగించారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి విద్యార్దులు అవగాహన కలిగి సేవా తత్వంతో ముందుకు రావడం జరిగిందని ప్రతి ఒక్కరు సమాజం పట్ల అవగాహన ,సామాజిక స్పృహ,సామాజిక చైతన్యం వంటి వాటిని అలవరచుకోవాలని ఈ సందర్భంగా గ్రామంలో ఉద్దేశించి మాట్లాడాం్. ఈకార్య క్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు లావణ్య,కళాశాల ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌టి. జైకిషోర్, అద్యాపకులు కృష్ణ,దొరబాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జనబాట



**సీతారామపురం డిసెంబర్ 23 ప్రభాతవార్త :** సిఎండి మరియు ఏపి ఎస్‌పిడి డిసిఎల్ ఆదేశాల ప్రకారం కరెంటవాళ్ళ జనబాట కార్యక్రమాన్ని సీతారామపురం మండలంలోని చిన్న నాగం పల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఏఇ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాలలో విద్యుత్‌కు సంబందించిన ప్రతి సమస్యను తీసుకొని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేసేందుకు కరెంటు వాళ్ళ జనబాట కార్యక్రమం చేపట్టామని అన్నారు.కరెంటువాళ్ళ జనబాట కార్యక్రమాన్ని ప్రతి మంగళ శుక్రవారాలలో నిర్వహిస్తామని అన్నారు.ప్రతి గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామంలోని విద్యుత్ సమస్యలను తెలుసకొని పరిష్కరిస్తామని అన్నారు.ఈకార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది గ్రామస్తులు పాల్గోన్నారు.

## మోడల్ స్కూల్‌లో ఆదార్ క్యాంపు ఏర్పాటు



**దగదర్తి, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** మండలంలోని తడకలూరు గ్రామ గిరిజన కాలనీలోని మోడల్ స్కూల్ నందు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థులకు ఆదార్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును తడకలూరు గ్రామ మాజీ సర్పంచ్ జలదంకి శ్రీ హరి నాయుడు.. ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీతో కలిసి ప్రారం భించారు. కూటమి ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు ఆధార్ సెంటర్ నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి విద్యార్థుల తల్లి దం డ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యుత్ శాఖ



**మనుబోలు డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మండలంలోని అక్కంపేట గ్రామంలో స్థానిక విద్యుత్ శాఖ అధికా రులు కరెంటోళ్ళ జనబాటకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ బృందం పర్యటించి అక్కడ విద్యుత్ సమస్యలు సంబందించి స్థానిక ప్రజాప్రతినిధులు ,వినియోగదారులతో ఆరా తీశారు. ఈనేపద్యంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను ఎల్‌టి లైన్లను ట్రాన్స్ పార్మర్లు గుర్తించారు. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి అంచనాలను సిద్దం చేసి ఉన్నతా ధికారులకు పంపి పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ శాఖ సిఎండి శివకుమార్ ఆదేశాల మేరకు నాణ్య మైన నిరంతర విద్యుత్ సరఫరా ధ్యేయంగా కరెంటోళ్ళ జనబాట వినూత్న రీతిలో కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జెఇ రాంబాబు,లైన్ ఇనస్పెక్టర్ శేషయ్య, లైన్ మ్యాన్‌లు కిషోర్‌కుమార్, రమేష్ శ్రీనివాస్, జెఎల్‌ఎంలు, వినియోగదారులు తదితరులు పాల్గోన్నారు.

## వెంగారెడ్డిపాళెంలో జనబాట కార్యక్రమాం



**సంగం డిసెంబర్ 23 ప్రభాతవార్త :** సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెంగ్రామంలో స్థానిక విద్యుత్ శాఖ అధికారులు కరెంటోళ్ళ జనబాటకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ మన్మధరావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ బృందం పర్యటించి అక్కడ విద్యుత్ సమస్యలు సంబందించి స్థానిక ప్రజాప్రతినిధులు,వినియోగదారులతో ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో గ్రామంలో విద్యుత్ సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ సిఎండి శివకుమార్ ఆదేశాల మేరకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా ధ్యేయంగా కరెంటోళ్ళ జనబాట వినూత్న రీతిలో కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి- పి.శ్రీనివాసరాజు



**ఉదయగిరి, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణంపల్లి నందు ఎస్ఎస్‌సీ–100 డేస్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించుటకు, ఉదయగిరి పంచాయతీ రాజ్ జేఈ ఏ.శ్రీనివాస రాజు సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సత్తార్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సయ్యద్, మన్సూర్ రోజ్జర్ సమన్వయంతో, ఎస్ఎస్‌సీ–100 డేస్ ప్రణాళిక అమలులో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతిలో రైజింగ్ స్టార్స్(సీ, డీ గ్రేడ్స్) అండ్ షైనింగ్ స్టార్స్(ఏ,బీ గ్రేడ్స్) అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పరీక్షల మార్కులను, స్టడీ క్లాసులను పరిశీలించి, అభ్యసన అభివృద్ధిలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సత్తార్ ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల స్థాయికి తగిన విధంగా బోధనను అందించి, నాణ్యమైన విద్యను అందిస్తూ, పరీక్ష మార్కులను, విద్యార్థుల ప్రగతిని పేరెంట్స్ తగో చర్చించి, 100శాతం రిజల్ట్స్ సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 100శాతం ఉత్తీర్ణత సాధించాలి



**లింగసముద్రం, డిసెంబర్ 21, ప్రభాతవార్త :** రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాస్ అవ్వాలని స్థానిక ఎంఈఓ-1 కే.మాల్యాద్రి తిమ్మారెడ్డిపలెం ఏపీ మోడల్ స్కూల్ నిర్వాహకులకు సూచించారు. తన విధి నిర్వహణలో భాగంగా ఆయన తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల విద్యాభ్యాసం విద్యాబోధన తీరు తెన్నులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థలో రానున్న పరీక్షలో నూరుశాతం ఫలితాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. పిల్లవాడు విద్యాభ్యాసంలో వెనుకబడినా, లేదా ఉత్తీర్ణత కాలేకపోయినా సంబంధిత ఉపాధ్యాయులు యాజమాన్యం తగిన మూల్యం చెల్లించాల్సి ఉందన్నారు. ఇందుకోసం 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించాల్సిందిగా ఆయన ప్రిన్సిపాల్ హప్తార్‌కు సూచించారు.

## గిరిజన కాలనీలోని పేదలకు దుప్పట్లు వితరణ



**కావలి,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** కావలి, కచ్చేరి మిట్ట నివాసులు, సంయుక్త సేవాసంస్థ సభ్యులు శాంతివర్ధన్ క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వారి తల్లిదండ్రులకు జి.సుధాకర్, జయలక్ష్మి పేర్లుమీద బుడంగుంట గిరిజన కాలనీలోని పేదలకు దుప్పట్లు వితరణ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడారు. ప్రీ క్రిస్మస్ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు దుప్పట్లు వితరణ చేయించిన దాత శాంతి వర్ధన్‌కి మరియు వారి కుటుంబసభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. శాంతివర్ధన్ గత 10సంవత్సరాల నుండి సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. అలాగే వారి తల్లిదంరడులు జి.సుధాకర్, జయలక్ష్మిల పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు.

## టిడిపి సీనియర్ నాయకులు మృతి



**కొడవలూరు,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మండలంలోని దామేగుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మడపర్తి రాజగోపాల్ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అధికారం ఉన్నా లేకపోయినా పార్టీ పట్ల నిబద్ధత, తెలుగుదేశం పార్టీకి అంకితమై పనిచేసిన మహోన్నతమైన వ్యక్తి రాజగోపాల్ వారి మరణం పార్టీకి తీరని లోటు, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని కల్పించాలని కుటుంబసభ్యులకి మండల అధ్యక్షులలు నాపై వెంకటేశ్వర్లు నాయుడు ఎస్సీ సెల్ అధ్యక్షులు తువ్వర ప్రవీణ్‌కుమార్ ప్రగాడ సానుభూతి తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి-సబ్‌కలెక్టర్



**కందుకూరు డిసెంబరు 23,ప్రభాతవార్త :** ఉత్తమ పలితాల సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమ వంశీ విద్యార్దులకు సూచించారు. మంగళవారం ఆయన ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్థానిక బాలుర హైస్కూలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్దులకు పలుసూచనలు సలహాలు చేశారు.పదవ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను, పరీక్షలకు వారి సన్నద్ధతను స్వయంగా పరిశీలిం చారు. పాఠశాలలో జరుగుతున్న ఇంగ్ల్లీష్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థుల ప్రశ్నాపత్రాలను మరియు వారు రాస్తున్న సమాధాన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థుల చేతిరాత, ప్రెజెంటేషన్ మరియు సమాధానాల సరళిపై టీచర్లకు పలు సూచనలు చేశారు.సమయ పాలనపై పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి, పక్కా ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ముఖ్యంగా కఠినమైన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారిం చాల న్నారు.మంచి గ్రేడ్లు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపు నిచ్చా రు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండలం ఎంఈఓ 2 కే సుబ్బారెడ్డి పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎం నరసింహమూర్తి,ఉపాధ్యాయులు ఎం రమణయ్య,చిత్తారి వెంకటేశ్వర్లు,ఎస్ మాధవ రెడ్డి,కే రాంబాబు,ఐ వి బి మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో శంకరరావు సేవలు భేష్



**వలేటివారిపాలెం, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** సకాలంలో ప్రజలకు సేవలను అందించాలని ఎంపీడీవో శంకరరావు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. కార్యాలయానికి వచ్చే సిబ్బందిని తిప్పు కోకుండా సకాలంలో పనులు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలియజేశారు.

## మాదక ద్రవ్యాల వినియోగం నువ్వుశక్తి నిర్వీర్యం అవుతుంది




**కావలి,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** గంజాయిలాంటి మాదక ద్రవ్య వినియోగంతో దేశ భవిష్యత్తు అయిన యవశక్తి నిర్వీర్యం అవుతుందని ప్రముఖ రచయిత, ఏపి తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్డీ విల్సన్ పేర్కొన్నారు. జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్య వ్యతిరేక పక్షోత్సవాల్లో బాగంగా మంగళవారం సాయి కోఆపరేటీవ్ జూనియర్ కళాశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రినిసపాల్ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోట్లాది మంది త్యాగాలతో మనకు 1947లో స్వాతంత్ర్యం సిద్దించిందని వారి త్యాగాలకు విలువనిచ్చి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించడానికి కృషి చేయాలని, తద్వారా కుటుంబానికి దేశానికి పేరు తేవాలని అన్నారు. విద్యార్తి దశలో మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం ముగిసిపోతుందని వివరించారు. తాను పర్యటించే ప్రతి ప్రాంతంలో తెలుగుబాష గొప్పతనం గురించి చెప్పడంతో పాటు మత్తుపదార్తాల అనర్థాలు గురించి చెబుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, రెండవ పట్టణ సబ్‌ఇన్స్‌పెక్టర్ గౌస్‌బాషా, న్యాయవాది గొట్టిపాటి మనోరమ, కావలి రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ కె.హరినారపరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ అడ్వైజర్ బెజవాడ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సిఎం కావాలని తిరుమలకు పాదయాత్ర



**కొడవలూరు,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** వైకాపా అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి 2029లో జరిగే ఎన్నికల్లో ముఖ్య మంత్రి కావాలని కోవూరు నియోజకవర్గ కొడవలూరు మండలం యల్లయపాలెం గ్రామానికి చెందిన గోవిం దమాల భక్తులు, వైకాపా నేతలు తిరుమల తిరుపతి దేవస్థానం వరకు భక్తిశ్రద్దలతో పాదయాత్ర చేసు న్నారు. కోవూరు నుంచి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షిస్తూ దీక్ష చేపట్టారు. వెంకటేశ్వరస్వామి దర్శనానంతరం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు రాజకీయంగా మరింత ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. విసిఆర్ దేవిరెడ్డి సాయిరెడ్డి, గోవింద మాల దీక్ష చేపట్టిన నాయకులకు సంఘీబావం తెలిపి పాదయాత్రను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తి భాస్కర్, కుటుంబసభ్యులు, మిత్రబృందం పాల్గొన్నారు.

## బూత్‌లెవల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం



**కావలి,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** కావలి ఆర్డీఓ కార్యాల యంలోని సమావేశ మందిరంనందు ఆర్డీఓ సన్నీ వంశ్రీకృష్ణ అధ్యక్షతన మంగళవారం కావలి నియో జకవర్గంకు సంబ ంధించిన బూత్‌లెవల్ ఏజెంట్లతో సమ్మరీ రివిజన్ అంశంపై కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్‌తో కలసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో బూత్‌లెవల్ ఏజెంటలకు ఎదురవుతున్న వివిధ సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకుని వెళ్ళగా సమస్యలను సవివరంగా పరిశీలించి విశ్లేషణాత్మకంగా పరిష్కార మార్గాలను సూచించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా సమ్మరీ రివిజన్ ప్రక్రి యను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో ఏజెంట్లకు స్పష్టత లభించిందని పాల్గొన్న బూత్‌లెవల్ ఏజెంట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు పాల్గొన్నారు

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**మర్రిపాడు ,డిసెంబరు23,ప్రభాతవార్త :** మర్రిపాడు మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో ఒక కెజిబివి , ఒక మోడల్ స్కూల్లో చదువుతున్న 350మంది 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్‌మర్రిపాడు మండల శాఖ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను ఆత్మ కూరు సిఐ గంగాధర్‌రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ మాట్లా డుతూ తాను జీవితంలో ఉన్నతస్థానానికి ఎదగడానికి ఉపాధ్యా యులు, క్రమశిక్షణతో కూడిన విద్య కారణమన్నారు. నందవరం మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమాన్ని మర్రిపాడు మండలంలో నిర్వహించిన యుటిఎఫ్ మండల శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు హెచ్.మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ , అధ్యక్షుడు పి.విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, జిల్లా కౌన్సిలర్లు జి.వి.సు బ్బారెడ్డి, చిలకపాడు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. మారుతికేశవరెడ్డి, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ మండల శాఖ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



**ఆత్మకూరు ,డిసెంబరు23,ప్రభాతవార్త :** సంగం మం డలం తలుపూరుపాడుకు చెందిన మహ్మద్‌రఫి భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, పొలానికి సర్వే చేయించాలని సిపిఐ , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు ఆర్‌డిఓ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి యామాల మధు , రైతు సం ఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.షాన్వాస్ మాట్లాడుతూ సంగం మండలం తలుపూరుపాడు గ్రామం లో మహ్మద్ రఫి గత 15సంవత్సరాలుగా తన 8ఎకరాల భూమిని వ్యవసాయం చేసుకుంటున్నారు. కొంతకాలంగా తన వ్యవసాయ భూమిని గ్రామంలోని గ్రామస్తునికి కౌలుకు ఇచ్చాడని కానీ వేరొక వ్యక్తి తనకున్న భూమిలో 8ఎకరాలు కూడా కలుపుకోవాలనే దురుద్దేశంతో పొలం హద్దులు మార్చి చూపుత న్నాడన్నారు. అనేకమార్లు పొలాన్ని అమ్మమని భయభ్రాంతులకు గురిచేశాడని కానీ పొలం అమ్మక పోయేసరికి ఎలాగైనా తన పొలంలో కలుపుకోవాలని గత ప్రభుత్వ హయాంలో రఫిని పొలంలోకి దిగకు ండా అడ్డుకున్నాడన్నారు. ఈపొలం విషయమై ఎన్నిసార్లు మండల అధికారులకు తెలియజేసినా స్పందిం చలేదన్నారు. చేసేదిఏమీలేక కలెక్టర్‌కు గ్రీవెన్స్‌డేలో అర్జీ ఇచ్చామని, పొలం హక్కుదారునికి రతు భరోసా కూడా వస్తుంది.రికార్డుల్లో హద్దులన్నీ ఉన్నప్పటికీ సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి భూ సర్వే నిర్వహించి రఫి భూమికి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. రఫిని బెదిరిస్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు టౌన్ కార్యదర్శి జంగం నాగరాజు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఇండ్ల అంకమ్మ, కొండయ్య, రమణయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సహకరించాలి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :**ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన జరుగుతుందని, ఇందుకు బూత్ లెవల్ ఏజెంట్లు తమ వంతుగా సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కోవూరు మండలంలోని బూత్ లెవల్ ఏజెంట్లతో ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాను 2025 జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా సర్ ప్రక్రియలో భాగంగా బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హత కలిగిన ఓటర్ల చేరిక, మృతుల తొలగింపు, తదితర కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఇందుకు ఏజెంట్లు కూడా తమవంతుగా వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్ వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, తదితరులు ఉన్నారు.

## కరెంటోళ్ల జనబాటను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిధిలోని చెర్లోపాలెం, గుమ్మలదిబ్బ గ ంగవరం గ్రామాల్లో మంగళవారం ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కరెం టోళ్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరి గిందని ట్రాన్స్ కో డీఈ మధుసూదన్‌రెడ్డి అన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల్లో తమ శాఖకు సంంధించిన ఏఈలు మునిరాజా, గిరిధర్, పూర్ణ చంద్రరావులు తమ సిబ్బ ందితో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించారన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ విని యోగ దారులు, ప్రజలు కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారని, వాటిని ప్రత్యేక యాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యను నిశితంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## వారోత్సవాలను జయప్రదం చేయండి



**వింజమూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** అటల్ దివస్ సుపరిపాలన దిన వారోత్సవాలను జయప్రదం చేయాలని వింజమూరు బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి ఈశ్వర్‌రెడ్డి పేర్కొ న్నారు. బుధవారం వింజమూరులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి, అటల్ స్మృతి సంవత్సర వారోత్సవాలను బీజేపీ జాతీయ పార్టీ అధ్యక్షులు నితిన్ నిబిన్ పిలుపు మేరకు రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆదేశాలతో జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షులు ఎన్.వంశీధర్‌రెడ్డి సహకారంతో ఫైవ్‌మెన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని బీజేపీ నాయకులు బీజేపీ అనుబంధ నేతలు పాల్గొనాలన్నారు. బీజేపీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ వాజ్‌పేయి రాజకీయ ప్రస్థానం మౌలిక సదుపాయాలు విదేశాంగ విధానం ప్రజా సంక్షేమ రంగాలలో చేసిన సంస్కరణలతో సహా సుప్రభాతం కోసం చేసిన కృషిని వారోత్సవాలను ఉత్సాహంగా బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు కార్యకర్తలను సమీకరించి పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడమే వాజ్‌పేయి నిజమైన వారసత్వ సంరక్షకుడుగా మరింత పటిష్టం చేయడం ముఖ్య లక్ష్యం అన్నారు. డిసెంబర్ 25 నుండి 31వ తేదీ వరకు జరిగే వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు చీదర్ల శివపార్వతి, జిల్లా కార్యదర్శి మారెళ్ళ బ్రహ్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు చుండి హరి గోపాల్, వరికుంటపాడు బీజేపీ మండల అధ్యక్షులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొండారెడ్డి, కే.అరుణ రెడ్డి, సేలం మాల్యాద్రి, మూలే బాలకృష్ణారెడ్డి, మేకపాటి మాల్యాద్రి నాయుడు, ముదుమాల రమేష్‌రెడ్డి, మెడబలిమి రామచంద్ర నారాయణరెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్ణయిం చిన ధరకే డీలర్లు ఎరువులు అమ్మాలని అందకుమించి ఎక్కువగా అమ్మితే అటువంటి షాపులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని పలు ఎరువుల దుకాణాలను మంగ ళవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు విక్రయించే దుకాణదారులు షాపు ముందు స్టాక్ బోర్డు, అందులో ధరలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు అందించే యూరియాను కార్డు ద్వారానే అందించాలని ఈ సంద ర్భంగా ఆమె దుకాణదారులకు సూచించారు. ప్రస్తుతం రైతులకు 700 మెట్రిక్ టన్నుల యూరియా అంద జేయడం జరిగిందన్నారు. యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు కూడా తీసుకుంటున్నామన్నారు.

## పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగ ళవారం మండలంలోని అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయానికి ప్రజా విజ్ఞప్తుల దినంలో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలే వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి వీఆర్‌వో వారి వారి పరిధిలో రెవెన్యూ పరమైన సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఒక గ్రామాన్ని ఒక నెలలో ఎంపిక చేసి నాలుగు పర్యాయాలు గ్రామంలో గ్రామ సభ నిర్వహించి సమస్యలను త్వరలో పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారని, దీనిపై వీఆర్‌వోలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, తదితరులు ఉన్నారు.

## సస్పెన్షన్ రద్దు చేయండి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** తమ న్యాయమైన సమస్యలను అధికారులకు చేసినందుకు 104 ఉద్యోగుల ప్రధాన కార్యదర్శికి సస్పెన్షన్ లెటర్ ఇవ్వడం జరిగిందని దానిని వెంటనే రద్దు చేయాలని మంగళవారం కలె క్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షులు విఆర్ ఫణికుమార్‌లు మాట్లాడుతూ సస్పెన్షన్‌కు గురైన చెట్ల రాంబాబు సస్పెన్షన్ను ఎత్తివేసి డ్యూటీ ఎక్కిం చాలని ఆయన కోరారు. భవ్య యజమాన్యం తగ్గించిన జీతాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు ఏడాదికి 15 క్యాజువల్ లీవ్స్ ఇవ్వాలన్నారు. 104 వాహనాలలో బఫర్ ఉద్యోగులను తీసుకోవాలన్నారు భవ్య యాజమాన్యం 7 నెలలు పూర్తయినా ఇప్పటివరకు ప్లే స్లిప్పులు నియామక పత్రాలు ఐడి కార్డులు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే తీర్చి సస్పెన్షన్‌కు గురైన ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబును తక్షణం విధుల్లోకి తీసుకొని డ్యూటీ ఎక్కించాలని వారు కోరారు.

## ఒక గ్రామం 4 సందర్శనలు



**బిట్రగుంట డిసెంబర్ 23 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు "ఒక మండలం ఒక గ్రామం 4 సందర్శనలు" కార్యక్రమం లో భాగం గా అల్లిమడుగు రెవెన్యూ, కడనూతల గ్రామ సచి వాలయం నందు మంగళవారం రైతుల నుండి అర్జీలు స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మొత్తం 13 అర్జీలు రాగా, ఈ కార్యక్రమంలో తహ శీల్దారు సాన. శ్రీనివాసులరెడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం రెవెన్యూ, సర్వే మరియు పంచాయతీ శాఖల సిబ్బంది పాల్గొనడం

## తల్లిదండ్రుల ఆశయాలను గుర్తించండి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** పదవ తరగతి చదివే ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను గుర్తెరిగి దానికి అనుగుణంగా ముం దుకు సాగాలని మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని జేబీఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తన సొంత నిధులతో అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ఈ వంద రోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కూడా సమిష్టిగా సమన్వయం చేసుకుని సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులు సలహాలు, సూచనలు, మంచి అల్పాహారం అందజేసిన ఎంఈఓ-2ను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## పీఎం స్వనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి స్వనిధి కింద బ్యాంకుల ద్వారా రు ణాలు అందిస్తున్నారని, దీనిని పొదుపు గ్రూపు మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం. మణిశంకర్ అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వీవోఏలకు పలు బ్యాంక్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద రుణాలు తీసుకునే పొదుపు మహిళలకు ఎటువంటి సెక్యూరిటీ అవసరం లేదన్నారు. ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందిస్తుందన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పొదుపు మహిళలు సీఫుడ్ వ్యాపారం, పచ్చళ్ల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ , ఊరగాయల వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. రూ. 10 లక్షల వరకు రుణాలు అందించే అవకాశం కూడా ఉంటుందన్నారు. అదేవిధంగా విశ్వకర్మ యోజన పథకం కింద చేతి వృత్తుల వారికి 2 లక్షల వరకు వడ్డీ రాయితీతో రుణాలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ముద్ర రుణాలను మూడు విభాగాలుగా రూపొందించడం జరిగిందని, కిశోరి పథకం కింద రూ. 50 వేల వరకు తరుణ్ పథకం కింద 5 నుంచి 10 లక్షల వరకు తరుణ్ ప్లస్ కింద 10 నుంచి 20 లక్షల వరకు 35 శాతం సబ్సిడీతో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఇటువంటి పథకాలపై పొదుపు మహిళల్లో అవగాహన కల్పించాలన్నారు. కేవలం నెల్లూరు జిల్లాలో డీఈఏఫ్ కింద వివిధ బ్యాంకుల్లో 125 కోట్ల మేర నిధులు ఉన్నాయని, అటువంటి వాటిపై కూడా ఖాతాదారుల్లో అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత కన్వీనర్ రవిశంకర్, బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్బరాజు, సీసీ రాము, తదితరులు ఉన్నారు.

## మునిసిపల్ కమిషనర్ తక్షణమే బీదా రవిచంద్రకి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

**- రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్**



**నెల్లూరు సిటీ, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్సీ, ప్రముఖ బీసీ నాయకుడు బీదా రవిచంద్రకి నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి అప్పగించిన సందర్భంగా శ్రేణులు, అభిమానులు ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ఫ్లెక్స్‌లను మునిసిపల్ కమిషనర్ తొలగించడం తీవ్రమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్ అన్నారు. ఈ ఘటన కేవలం ఒక వ్యక్తిపై కాదు, మొత్తం బీసీ సమాజ గౌరవంపై జరిగిన దాడిగా భావించాల్సి వస్తోంది. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాప్రతినిధికి శుభాకాంక్షలు తెలియజేయడం సహజమైన హక్కు. ఆ హక్కును కాలరాసేలా, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఫ్లెక్స్‌లను తొలగించడం అన్యాయమైనది, వివక్షతో కూడినదన్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై మునిసిపల్ కమిషనర్ తక్షణమే బీదా రవిచంద్రకి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం - యువజన విభాగం తరపున రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీల గౌరవం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసారు.

## తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి




**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని ఇనమడుగు, వేగూరు ప్రాంతాల్లో బీపీటీ వరి రకానికి ఉల్లి కోడు తెగులు సోకి ఉందని మండల వ్యవసాయాధికారిణి రజని అనా న్నరు. మండలంలోని పై గ్రామాల్లో మంగ ళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగ ంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ దీని నివారణకు గా నూ కార్బోఫిరాన్ గుళికలు ఎకరానికి 6 లేదా 7 కిలోలు చల్లుకోవాలని సూచించారు. ప్రస్తుతం రైతులకు పీఎం కిసాన్ పథకం కింద జనవరి నెలలో 2 వేలు వారి వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఇందుకు వారు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి ఫారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా రబీ సీజన్‌కు సంబంధించి ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కళ్యాణి, శిరీష, రైతులు ఉన్నారు.

## ప్రాథమిక దశ నుంచి మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రదానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి తెలిపారు. కోవూరులోని ఎ చ్చిపాల రామనా థమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం తన జన్మది నోత్సవాన్ని పురస్కరి ంచుకుని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ మొక్కలు జీవకో టికి ప్రాణవా యువును ఇస్తాయన్నారు. మొక్కలు నాటటమే కాకుండా దాని సంరక్షించే బాధ్యత కూడా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రధానో పాధ్యాయురాలిని ప్రత్యే కంగా అభినందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుభదిన్ తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు స్వీట్, హాట్ పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరులోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో మంగ ళవారం సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్ ఆధ్వ ర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వ హిం చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యా లయ ఉద్యోగులు మధు, సుబ్రహ్మణ్యం, మహిళా ఉద్యో గులు ఉన్నారు.

## గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా మారాలి



**కోవూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :** గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రజలు పూర్తిసా యిలో సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి వసుమతి తెలిపారు. కోవూరు మండలం పోతి రెడ్డి పాలెం గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా పరిశీ లించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ ప్రజలు తమ చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్లకు తడిచెత్త పొడి చెత్త రూపంలో వేరువేరుగా అందించాలన్నారు. అనంతరం ఆమె గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, తదితరులు ఉన్నారు.

## పోర్టులో 1200 మందికి శిక్షణ ఇచ్చేలా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్

**- కంపెనీ ప్రతినిధులు, యాజమాన్యానికి ధన్యావాదాలు తెలిపిన ప్రజలు**



**ముత్తుకూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అండ్ టీమ్ ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. మంగళవారం ముత్తుకూరు మండల పరిషత్ కారా ్యలయ ఆవరణంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వం ర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక యువతలో వివిధ వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. 1200 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇది చాలా ఆనందాన్ని ఇచ్చే అంశం 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో 42 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా 2.30 లక్షల మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది వైసీపీ హయాంలో స్కిల్ డెవలప్మెంట్ పై కక్షకట్టి నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక స్కిల్ డెవలప్మెంట్ అంశం పూర్వవైభవం దిశగా సాగుతో ందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం వద్ద 2 ఎకరాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ క్రమంలోనే అదానీ కృష్ణపట్నం పోర్టు కూడా శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. ఇప్పటికే కృష్ణపట్నం గ్రామంలోని తుఫాన్ షెల్టర్‌లో మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. కంప్యూటర్ ట్రైనింగ్ కూడా అందుబాటులోకి రాబోతోంది ముత్తు కూరు, కృష్ణపట్నం పంచాయతీలకు నాలుగు వాహనాలకు అప్పగించడం శుభపరిణామన్నారు. రెండు వాహనాలను చెత్త తరలింపునకు ఉపయోగించనున్నారు మరో రెండు వాహనాలను ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న చిన్నారులను బడికి తీసుకెళ్లి రావడానికి ఉపయోగించనున్నారు. చలివేంద్ర నుంచి గిరిజన పిల్లలు 2.5 కిలోమీటర్లు నడిచి ముత్తుకూరు స్కూలుకు రావల్సివస్తుందన్నారు. వీరితో పాటు కృష్ణపట్నం చిన్నారులు బడికి వెళ్లేందుకు ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ముత్తుకూరులో సైడ్ డ్రైన్ల నిర్మాణానికి రూ.2.65 కోట్లు కేటాయించారు. మొదటి దశలో ఆర్అండ్‌ఆర్ కాలనీల్లో పనులు ప్రారంభిం చారన్నారు. రూ. 2 కోట్లతో శ్మశానంలో అవసరమైన వసతులు కల్పించనున్నారు. రూ.1.19 కోట్లతో 345 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారని, మినీ స్టేడియం నిర్మాణానికి మొదటి విడతగా రూ.24 లక్షలు ఖర్చుపెడుతున్నారన్నారు. డంపింగ్ యార్డుకు రూ.30 లక్షలు ఖర్చు చేయబోతున్నారన్నారు. కృష్ణపట్న ంలోనూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మంచినీటి పథకం ఏర్పాటు చేయడంతో పాటు హైస్కూలులో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, సోలార్ వీధిలైట్లు అందుబాటులోకి తెస్తున్నారన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్, కార్పొరేట్ ఎఫైర్స్ రామ్, వేణుగోపాల్, మురళి, సాంబశివరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ సౌకర్యాలన్ని మనకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ప్రజలందరి తరఫున అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యానికి, ప్రతినిధులందరికీ ధన్యవాదములు తెలియజేస్తున్నానన్నారు. గిరిజన పిల్లలు బడికి వెళ్లడమే కష్టం.వారు రోజుకు రానుపోను 5 కిలో మీటర్లు నడిచివెళ్లడం ఇంకా కష్టసాధ్యం. వారి కోసం పోర్టు యాజమాన్యం వ్యాను ఏర్పాటు చేయడం సంతోష మన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, మునుకూరు రవికు మార్ రెడ్డి, టిడిపి తెలుగు యువత అధ్యక్షులు రాగల శివకృష్ణ, ముత్తుకూరు పట్టణ అధ్యక్షులు బులిగర్ల శ్రీనివాసులు, అక్కయ్య గారు ఏడుకొండలు, తిన్నెలపూడి సిద్దయ్య, బిజెపి మండల ఉపాధ్యక్షులు వడ్ల మూడి వెంకట రమణయ్య నాయుడు, దండు శ్రీనివాసులు, ఐటిఐ విభాగ నాయకులు సతీష్ నాయుడు, సర్వేపల్లి జనసేన నాయకులు సురేష్ నాయుడు, గోనెల సిద్దయ్య, శంకర్, వాకాటి చంగయ్య, పల్లం రెడ్డి శేఖర్ రెడ్డి, పల్లికొండ సీనయ్య, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీంప్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లలో బాల కార్మికుల నిర్మూలనే లక్ష్యం




**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** నెల్లూరు అంబేద్కర్ భవన్‌లో మంగళవారం శ్రీంప్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లో పని చేసే వర్కర్స్‌కు జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఏడి షాన్ భాష, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్, సర్ఫ్ ఎన్‌జిఓ నుండి సుమన్, నవజీవన్ ఎన్జీవో నుండి పెంచలయ్య విచ్చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్ మాట్లాడుతూ శ్రీంప్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లో చైల్డ్ లేబర్ ఉండకూడదని చైల్డ్ లేబర్ పెట్టుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్కడైనా సరే చైల్డ్ లేబర్ ఉన్నట్లయితే 1098కి ఫిర్యాదు చేయాలని తెలియజేశారు, ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఏడి షాన్ భాష మాట్లాడుతూ శ్రీంప్ ప్రాసెసింగ్ యూనిట్స్‌ని నిర్వహించడానికి కావలసి నటువంటి రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ గురించి చట్ట పరంగా ఎటువంటి రూల్స్ పాటించాలని చట్టం గురించి వివరించారు. చైల్డ్ లేబర్ డిపార్ట్మెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ చైల్డ్ లేబర్ యాక్ట్ గురించి, యజమానుల పైన ఎటువంటి శిక్షలు ఉంటాయి యజమానులు పిల్లల్ని పనులు పెట్టుకుంటే యజమానులు నుండి పిల్లలకు ఇప్పించే, నష్ట పరిహారం గురించి తెలియజేశారు. శ్రీంప్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లో తీసుకునే వర్కర్స్ యొక్క ఏజ్ ను 19 ఉండే వాళ్లను దృష్టిలో పెట్టుకొని సిబ్బంది డ్యూటీలో జాయిన్ చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లాలోని శ్రీంప్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లోని వర్కర్స్, నవజీవన్ సర్ఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీదా రవిచంద్రకు సముచితస్థానం ఇవ్వడం అభినందనీయం

**- జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి**



**బుచ్చి డిసెంబర్ 23 ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ఎంపికైన ఎంఎల్‌సి బీద రవిచంద్రకి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిరంతరం టిడిపి పార్టీకోసం జిల్లాలో అలుపెరగని కష్టంచేస్తు పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఎటువంటి పదవులు ఆశించకుండా కార్యకర్తలకు నాయకులకు,బిసిలకు ఎల్లవేళలా అండగా ఉండే వ్యక్తి బీదా రవిచంద్ర అని ఆయన ప్రశంసించారు. సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో టిడిపి పార్టీని ముందుకు తీసుకొని వెళుతు నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు నియమితులైన బిసి నాయకులు ఎంఎల్‌సి బీదరవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. బీద రవిచంద్ర కుటుంబతో తమకు 30 సంవత్సరాల అనుబంధం ఉందని వారు ప్రజలకోసం,పార్టీకోసం కృషి చేస్తారని ఆయన కొనియాడారు.

## కేసిసి క్రికెట్ టోర్నమెంటు పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కావలి,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** కావలి ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంలో 28నుండి జరగనున్న కేసిసి క్రికెట్ టోర్న మెంటు రెండవ సీజన్‌కు సంబందించిన పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెం కటక్రిష్ణారెడ్డి తన నివాసంలో ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడారు క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడా స్పూర్తితో, క్రీడా నియమాలను పాటిస్తూ టోర్నమెంటును విజయవంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ క్రికెట్ టోర్నమెంటు ఈ నెల 28నుంచి కావలి నియోకవర్గం మరియు జలదంకి మండల స్థాయి పరిదిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కేసిసి క్రికెట్ టోర్నమెంటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో కేసిసి క్రికెట్ టోర్నమెంటు కమిటీ అధ్యక్షులు సిద్దు, విక్రమరెడ్డి, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులుగా మామిడి





**కావలి,డిసెంబర్ 23 ప్రభాతవార్త :**భారతీయ జనతాపార్టీ శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులుగా కావలి రూరల్ మండలానికి చెందిన మామిడి వెంకటేశ్వర్లు బాధ్యతలుచేపట్టడం జరిగింది. నెల్లూరు పట్టణంలోని బిజెపి కార్యాలయం నందు మంగళశారం జరిగిన కార్యక్రమంలో బిజెపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి మామిడి వెంకటేశ్వర్లును ఓబీసి మోర్చా నెల్లూరుజిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ నూతన బాధ్యత స్వీకరణ పత్రాన్ని అందజేయడం జరిగింది. మామిడి వెంకటేశ్వర్లు గతంలో కావలి రూరల్ మండల బిజెపి అధ్యక్షులుగా పనిచేసి మండలంలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరిగింది. ఈ సందర్బంగా మామిడి వెంకటేశ్వర్లు మాట్లాడారు. బిజెపి నాయకులు కార్యకర్తల సహకారంతో బిజెపి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

## బాధ్యతలు భార్యలది పెత్తనం భర్తలది



**విడవలూరు,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధశాఖ అధికారులు, మండల ఎంపిటిసిలు, గ్రామ సర్పంచ్‌లు మధ్య ప్రజా సమస్యలపై ముఖాముకి సమావేశం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయితే భార్యల స్థానంలో భర్తలు హాజరు కావడం విశేషం. అధికార పార్టీ అండతో సర్పంచ్ భర్తలు చలామణి చేస్తూ సభలకు దర్శనమిస్తున్నారు. సర్వసభ్య సమావేశంలో పాల్గొనే సర్పంచ్‌లు, ఎంపిటిసిలు చేత ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది సంతకాలు స్వీకరణలో ఎవరి సంతకం చేస్తున్నారో సమావేశానికి వచ్చిన సర్పంచ్‌లు గుసగుసలాడుకుంటున్నారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోండి : బిజెపి



**బుచ్చి డిసెంబర్ 23 ప్రభాతవార్త** ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని బిజెపి అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆధ్వ ర్యంలోజనతావారధి కార్యక్రమాన్ని నిర్వ హించారు. తహసిల్దారుకి వినతి పత్రం సమర్పించారు. భారతప్రధాని నరేంద్ర మోడి చిత్రపటాలు పట్టుకొని నినాదాలు చేశారు. స్థానిక సంస్థలైన పంచాయితీలు, మున్సిపాల్టీలు, కార్పోరేషన్లు మరియు మండల పరిషత్‌లకు 14 వ 15 వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుండి ఇస్తున్నారని వారు తెలిపారు. వేల కోట్లు అభివృద్ధి కార్యక్రమాలకు ఇస్తుంటేే ఎక్కడ శిలాఫలకాలపైన భారత ప్రధాని నరేంద్రమోడీ పోటో గాని, కేంద్ర ప్రభుత్వం పేరు గాని లేకుండా ఉండడం ఏమిటని ప్రశ్నంచారు. అధికారులు,పాలకులు ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిదులు, కేంద్రం రాష్ట్ర ప్రబుత్వానికి అనుసంధానంగా ఇస్తున్న నిదులకు సంబంధించి శిలాఫలకాలపై వేయాలని ప్రధాని నరేంద్రమోడీ పోటో వేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఆలూరు నాగవేణి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి మోహన్‌బాబు, బుచ్చి రూరల్ బ్యాంకు డైర్టర్ మాచవరం శ్రీనివాసులు, గంగపట్నం శ్రీనివాస్ తేజా, అర్బన్ ప్రధాన కార్యదర్శి గోలి సురేంద్ర, ఎస్‌పి మోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్ళ నరసింహులు, కిసాన్‌మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిమలూరు ప్రవీణ్‌కుమార్, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు పార్లపల్లి మహేష్‌నాయుడు, అర్బన్ ఉపాధ్యాక్షులు సందల నాగేశ్వరరావు, అర్బన్ కార్యదర్శులు గాదంశెట్టి సురేష్,కాసా వెంకట నాగార్జున, బిజెవైఎం నాయకులు,ఊకోటి శశి,శ్రీనివాసులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్దులను అభినందించిన ఎంఇఓ దిలీప్‌కుమార్




**బుచ్చి డిసెంబర్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రత్నం ఇంగ్లీష్ మీడియ హైస్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం సందర్బంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్దులకు ఎంఇ దిలీప్‌కుమార్ అభినందించారు.. ఎంఇఓ డైరక్టర్ వెంకట్ చేతుల మీదుగా విద్యార్దులకు బహుమతి ప్రధానం చేశారు.ఈ సందర్బంగా ఎంఇఓ మాట్లాడుతు శ్రీనివాస రామానుజన్ జయంతిని గణిత దినోత్సవంగా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. విద్యార్దులు మ్యాడ్స్ పట్ల ఆసక్తి చూపించాలని అన్నారు. ప్రతి విద్యార్ది శ్రీనివాస రామానుజంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

## అపస్మా ఆధ్వర్యంలో విద్యార్దులకు క్రీడాపోటీల నిర్వహణ




**నెల్లూరు,డిసెంబరు23 ప్రభాతవార్త- విద్య** అపస్మా,మైదిలి మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో నెల్లూరు,నెల్లూరు రూరల్ ప్రాంతాల్లోని అపస్మా పాఠశాలల్లో చదివే విద్యార్దులకు క్రీడాపోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా అపస్మా రాష్ట్రసీనియర్ ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి, డిప్యూటీ డిఈఓ వెంకటేశ్వర నాయక్, జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వల గావించి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్బంగా నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతు క్రీడతలో శారీరక, మాసశిక దృఢత్వం లబిస్తుందన్నారు. అలసిన దేహానికి క్రీడలు పునరుత్తేజాన్ని అందింస్తాయన్నారు. విద్యార్దుల్లో మానశిక ఉల్లాసం కోసం నేడు ఈ పోటీలను నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ మాట్లాడుతు క్రీడల్లో గెలుపోటములు సర్వసాదారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలన్నారు. అందరూ క్రీడా స్పూర్తితో మెలగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్దులకు వివిధ క్రీడల్లో పోటీలను నిర్వహించి ఉత్తమంగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అపస్మా నాయకులు వెంకట్రామయ్య, రామ్మెహన్‌రెడ్డి, కృష్ణారావు, ఎస్‌వీఆర్ రమేష్, అభిషేక్‌రెడ్డి, శ్రీ సాయి మహావిద్యాలయ టి.నారాయన , విద్యోదయ స్కూల్ వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సాల్వేషన్ ఆర్మీ వారి సేవలు అభినందనీయం

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త మంగళవారం స్థానిక దర్గా మిట్టలోని డిహెచ్క్యూ ప్రాంగణంలో సాల్వేషన్ ఆర్మీ తరపున జీసెస్ జన్మదినం సందర్భంగా పేదలకు చీరలు, బ్లాంకెట్‌లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని పేదలకు చీరలు, బ్లాంకెట్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాల్వేషన్ ఆర్మీ పేదలకు చేసే సేవలో తమ వంతు సహకారం ఉంటుందన్నారు. సీతా కాలములో పేదలకు బ్లాంకెట్లు పంచడం మంచి పరిణామని అన్నారు. క్రైస్తవ సొదర, సోదరీమణులు ప్రేమానురాగాలతో, క్రిస్మస్ వేడుకలను అందరూ ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాల్వేషన్ ఆర్మీ డివిజినల్ కమాండర్ డి. జోసెఫ్, వారి సతీమణి సుసీలమ్మ, డివిజినల్ సెక్రెటరీ కలు జయ కుమార్, రత్నం, పాస్టర్లు ప్రశాంత్ కుమార్, జ్యోతి, కోర్ సెక్రటరీ టి.బాల సుధాకర్, టి. విజయ కుమార్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## జేసీచే జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025 పోస్టర్ విడుదల



నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో వినియోగదారులకు అవగాహన నిమిత్తం పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బి. లీలారాణి జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జున్ రావు, జిల్లా సహాయ సరఫరా అధికారి లక్ష్మీనారాయణ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయరహదారిపై నాకాబంది వాహన తనిఖీలు





**ఆత్మకూరు,డిసెంబరు23,ప్రభాతవార్త :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం వద్ద నెల్లూరు -ముంబాయి జాతీయరహదారిపై వాహనాల వేగాన్ని గుర్తించే ప్రత్యేక స్పీడ్‌గన్‌తో వాహన తనిఖీలను ఆత్మకూరు ఎస్‌ఐ జిలానీవారి సిబ్బందితో నిర్వహించారు. జిల్లా ఎస్పీ అజితవేజెండ్ల ఆదేశాలతో ఆత్మకూరు డియస్పీ కె.వేణుగోపాల్, సిఐ జి.గంగాధర్‌ల సూచనలతో నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై మంగళవారం తనిఖీలు నిర్వహించామని ఎస్‌ఐ జిలానీ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీడ్‌గన్ యంత్రం ద్వారా వాహనం ప్రయాణించే వేగాన్ని గుర్తించి వారిపై జరిమానా విధించడం, కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వీటితోపాటు వాహనాలకు సరైన పత్రాలు లేకున్నా , ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ సరైన పత్రాలను వాహనంతోపాటు ఉంచుకోవాలని మోటార్‌వెహికల్ చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జేమ్స్, స్టేషన్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## డీఎంఅండ్‌హెచ్‌ఓకు శుభాకాంక్షలు



**నెల్లూరు,డిసెంబర్ 23, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ వి.సుజాత డీఎంహెచ్ఓగా పదవీ బాధ్యతలు చేపట్టి మంగళవారానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్బంగా ఆ శాఖలోని పలువురు అధికారులు సుజాతకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి ఒడిదుడుకులు లేనిపాలన సాగించిన సందర్బంగా బయాలజిస్ట్ వి.నాగార్జునరావు, అడిషనల్ డీఎంహెచ్ఓ ఎస్‌కే ఖాదర్ వలీ, ఏవో నిశాంత్‌రెడ్డి, కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో డీఎంఅండ్‌హెచ్ఓను కలిసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్రకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే కాకర్ల



**నెల్లూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త - వైద్యం** ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీదరవిచంద్రకి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శుభాకాంక్షలుతెలిపారు.మంగళవారం నెల్లూరులోని బీదనివాసంలో మర్యా దపూర్వకంగా రవిచంద్రని కలిసిపుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్ష పదవి రావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

## కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాల పంపిణీ

**- శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్ కుమార్ నాయక్**



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివ జ్యోతి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా కంచెరపాలెం గ్రామరైతులకు మంగళవారం వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. 30 కేజీల వంతున 35 సంచులు విశిష్టరకం వేరుశనగ విత్తనాలు రైతులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ ఈ విశిష్ట రకం తిక్క మచ్చ తెగులు, తృప్పు తెగులును తట్టుకొనే రకం అని కొంత మేర కుళ్ళు తెగుళ్లను తట్టుకొని అధికదిగుబడిని ఇస్తుందని రైతులకు తెలిపారు. జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా సామూహికంగా 35 మంది వేరుశనగ రైతులకు 35 సంచుల విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందని విజయ్ కుమార్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేరుశనగ సాగు చేసే రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం



**నెల్లూరు డిసెంబర్ 23ప్రభాతవార్త వైద్యం** నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 21వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వ హించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయ వంతమైంది. జరిగిన మూడు రోజుల్లో 99.21 పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి . సుజాత మంగళవారం ఒక ప్రకటనలోతెలిపారు.మూడవ రోజైన మంగళవారం నిర్వహించిన ఇం టింటి పల్స్ పోలియో కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అంగన్వాడీ సిబ్బంది 2,71,184 గృహాలను సంద ర్శించి 4,628 మంది ఐదుసంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు . జిల్లాలోని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ వైద్య ఆరోగ్య,అంగన్వాడి ఇతర స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, పీఎంపీ అసోసియేషన్ సిబ్బంది పోలియో వ్యాక్సిన్ వేశారని ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వాళ్ళను కూడా గుర్తించి వారం రోజుల లోపల పోలియో వ్యాక్సిన్ వేయవలసిందిగా డిఎం అండ్ హెచ్ ఓ వి. సుజాత ఆదేశించారు . నెల్లూరు జిల్లాను పోలియో రహిత జిల్లాగా మార్చడంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు

## ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన సిఐ శ్రీనివాసులురెడ్డి



సంగం డిసెంబర్ 23 ప్రభాతవార్త సంగంలోని శివాలయం సెంటర్‌లో,బస్‌స్టాండ్ సెంటర్‌లలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియంత్రణపై సిఐ శ్రీనివాసులురెడ్డి ,ఎస్‌ఐ రాజేష్‌తో కలిసి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండడానికి పాటించాల్సిన నిబంధనల గురించి అందరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి ఆటో డ్రైవర్ తప్ప ని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. ఏదైనా అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆటోలలో ఓవర్ లోడ్ ఎక్కించుకొంటే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కరెంటోళ్ళ జనబాట



**బుచ్చి డిసెంబర్ 23 ప్రభాతవార్త** ఈరోజు జిల్లా అంతటా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కరెంటోళ్ళ జనబాట కార్యక్రమంను అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ కె.రాఘవేంద్రం, కోవూరు డివిజన్ పరిధిలోని దామరమడుగు, సెక్షన్‌లోని పెనుబల్లి గ్రామంలో పర్యటించి, అక్కడి వినియోగదారులతో ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద కూడా సందర్శించి సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మాట్లాడుతూ, వినియోగ దా రుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యంతో మా చైర్మన్ అండ్ మే నేజింగ్ డైరెక్టర్ శ్రీ లోతేటి శివశంకర్ ఐఏఎస్ కరెంటోళ్ళ జనబాట కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. ఈకార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించబడుతుందని, అలాగే ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్.ఈ కార్యక్రమం కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుండి 9:30 గంటల వరకు జరుగుతుందని వివరించారు.జిల్లా అంతటా అధికారులు, సిబ్బంది ఉదయం 7:30 గంటలకే ఫీల్డ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఫీల్డ్‌లో గుర్తించిన లూజ్ లైన్లు, డామేజ్ అయిన పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకడం, కండక్టర్ డామేజ్ వంటి అన్ని సమస్యలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఆర్డీఎస్ఎస్ (RDSS) స్కీమ్ ద్వారా ప్రతి పల్లెకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఈ సెక్షన్ పరిధిలోని ఆరు గ్రామాల్లో పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని, జిల్లా అంతటా ఆర్డీఎస్ఎస్ పథకం సమర్థవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు.ఫీల్డ్‌లో అధికారులు పర్యటించిన సందర్భంగా వినియోగదారుల నుంచి వచ్చిన స్పందనపై వివరాలు సేకరిస్తున్నామని, అలాగే ఈ యాప్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది గమనించిన లోపాలు ఏవైనా ఉంటే వాటిని కార్పొరేట్ ఆఫీస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని జిల్లా సూపరింటెండెంట్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ బాలచంద్ర , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ , అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగసూరి దొరసానమ్మ ,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కరెంటోళ్ళ జనబాట



**నెల్లూరు డిసెంబర్ 23 ప్రభాతవార్త** ఈరోజు టౌన్ డివిజన్ నందు కరెంటోళ్ళ జనబాట కార్యక్రమం అన్ని సెక్షన్స్ నందు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌శ్రీధర్ పొదలకూరు రోడ్డు లోని లేక్ వ్యూ కాలనీలో పాల్గొనడం జరిగింది. అక్కడ వినియోగదారులతో సమావేశమయ్యారు.11 కెవి లైన్,ఎల్.టి.లైన్ ట్రాన్స్ఫార్మర్స్‌ను పరిశీలించడం జరిగింది. లోపాలను ఫొటో స్ తీసి సిబ్బంది యాప్‌లో పొందుపరిచే ప్రక్రియను పరిశీలించారు.అంగన్వాడీ సెంటర్ కు వెళ్లి కరెంటోళ్ళ జనబాట గురించి వివరించారు. డివిజన్ లోని 12 సెక్షన్స్‌నందు ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది అని వారానికి రెండు రోజులు జరుగుతుంది అని మంగళవారం శుక్రవారం జరుగుతుంది అనితెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ , అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి నారాయణ, జూనియర్ ఇంజనీర్ సుకుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## చిన్నబజార్ స్టేషన్‌లో ప్రి క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** చిన్నబజారు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఇన్‌స్పెక్టర్ క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శనీయమని ఆయన ఈ సం దర్భంగా పేర్కొన్నారు. క్రిస్మస్ సంద ర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ అయ్యప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

## బూత్ స్థాయి ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం



**దగదర్తి, డిసెంబర్ 23, ప్రభాతవార్త** మండలంలోని వివిధ రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు, బీఎల్ఓలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పి.కృష్ణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ లో కుటుంబంలోని ఓటర్లను క్రమ పద్దతిలో నమోదు చేసేలా స్థానిక బీఎల్ఓల ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు ఏమైనా అభ్యంతరాలు ఓటర్ల జాబితాలో సమస్యలు ఉంటే బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రియాంక, వివిధ రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.



## విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి

**బిట్రగుంట డిసెంబర్ 23, ప్రభాతవార్త** సమాజం లో ప్రతి విద్యార్థి క్రమశిక్షణ తో, వ్యక్తి గత పరిశుభ్రతను పాటిస్తూ విద్యను అభ్యసించాలని లోక్ అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి పేర్కొ న్నారు.

## గత పదేళ్లుగా దైవ కార్యాన్ని దైవ కార్యంగానే చేస్తూ వచ్చాం

**పొరుగువారిని మిమ్ము వలే ప్రేమించమన్న ఏసు ప్రభువు మాటలు పాటిద్దాం. టీడీపీ ప్రభుత్వం క్రైస్తవ సమాజానికి ఎలా అండగా ఉంటుందో స్పష్టంగా తెలిపారు. బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్**



**నెల్లూరు,డిసెంబర్ 23, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర, పార్లమెంటు టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ట్ అథారిటీస్ చైర్మన్ జడ్ శివప్రసాద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రార్థనలు జరిగాయి. పలువురు పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు బీద రవిచంద్ర మాట్లాడుతూ నిన్న జరిగిన క్రిస్మస్ హై టీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రైస్తవ సమాజానికి టిడిపి ప్రభుత్వం ఏ విధంగా అండగా ఉంటుందో స్పష్టంగా తెలిపారని అన్నారు. టిడిపి ప్రభుత్వం ముస్లిం హిందూ క్రైస్తవ సమాజ యొక్క హక్కులను కాపాడుకుంటూ వస్తుందని మంచి పరిపాలన అందించేందుకు మీ అందరి సహకారం, దీవెనలు ఉండాలని కోరారు. ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, పదేళ్లగా జిల్లా కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని, దైవ కార్యాన్ని దైవ కార్యంగానే చేస్తున్నామని అన్నారు. పార్టీ కార్యాలయానికి వెళ్తున్నామన్న భావన ఎవరికి కలగనివ్వలేదని అన్నారు. పొరుగువారిని మిమ్మువలే ప్రేమించమని ఏసు ప్రభువు చెప్పారని, మీకోసం ఎలా మంచి చేసుకుంటారో, పొరుగువారిని కూడా అలానే చూడాలని అన్నారు. కార్యక్రమంలో జెన్నీ రమణయ్య, పెంచల నాయుడు, గంగాధర్, పనబాక భూలక్ష్మి , జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, జాఫర్ షరీఫ్, రేవతి తదితరులు పాల్గొన్నారు.